# అమ్మవారి కావిడి

కావడిలో ఒకవైపు అమ్మవారి విగ్రహం, ఒక పళ్లెంలో పూజాద్రవ్యంలు, పసుపు, కుంకుములు ఉంచి కావిడిలో వేరొకవైపు భిక్షం పెట్టించుకుంటూ ఇంటి ఇంటికి తిరిగేదే అమ్మవారి కావిడి వీరు ప్రతి ఇంటికి వెళ్లి ఇంటిముందు అమ్మవారు మీ ఇంటికి అనుగ్రహించటానికి వచ్చింది అంటూ ఆ పళ్లెంతో తిరుగుతారు. పెద్దగా ఇంటిలో అందరికి వినపడేటట్లుగా అరుస్తారు. వారి అరువు విని ఇంటిలోని ఇల్లాలు ఒక పళ్లెంలో బియ్యం, కూరగాయలు వగైరా తీసికొనివచ్చి కావడిలో ఉన్న అమ్మవారికి దణ్ణంపెట్టుకొని అమ్మవారి ముందు పళ్లెంలో ఉన్న కుంకాన్ని భక్తి భావంతో తీసికొని బొట్టుపెట్టుకొంటారు.

ఈ కళారూపం జానపదులు మరియు గ్రామస్థులలో ఉన్న నమ్మకానికి ప్రస్ఫుటం చేస్తుంది. అమ్మవారిని ఎంతో దూరం నుండి తీసికొనివచ్చామని జానపదుల భావనకాగా అమ్మవారు తమ ఇంటి ముందుకే వచ్చారనేది ఒక శుభశకునంగా భావించి ఇంట్లోవారు భక్తి భావనతో కావిడి దగ్గరకొచ్చి అమ్మవారికి నమస్కరించి కుంకుమ ధరిస్తారు, మరియు దానంచేయుటమనే సత్కార్యాన్ని ఆచరిస్తారు. ఈ విధంగా గృహిణికి పుణ్యము మరియు జానపదునికి పారితోషికము లభిస్తాయని అంటారు.

ఈ కళారూపం ప్రజలలో భక్తిభావన పెంచుటకు దోహదపడుననుటలో అతిశయోక్తి లేదు.